## కేసీఆర్‌కు తీర్థప్రసాదాలు అందజేత



కేసీఆర్‌తో వర్ధరాజులస్వామి పూజారులు

మర్కూక్,మే27: మండలంలోని వర్ధరాజ స్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రవీణ్, ఆలయ సభ్యులు,పూజారులు సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దంపతులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను కేసీఆర్ ఆలయ సభ్యులను అడిగితెలుసుకున్నారు. చివరిదశలో ఉన్నాయని వారు కేసీఆర్‌కు చెప్పగా త్వరలోనే స్వామివారిని దర్శించుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణం



బందారంలో పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణమహోత్సవానికి హాజరైన మహిళలు

కొండపాక(కుకునూరుపల్లి), మే 27 : కొండపాక మండలంలోని బందారంలో సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణం భవానందశర్మ వైదిక నిర్వహణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజు కులస్తులు పెద్దమ్మ-పెద్దిరాజులకు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మదిరాజ్ సంఘం నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంతాన వేణుగోపాలుడి‘ గజారోహణం’



గజారోహణంపై ఊరేగుతున్న వర్గల్ శ్రీవేణుగోపాలస్వామి

వర్గల్, మే 27: మండల కేంద్రంలోని పురాతన ఆలయమైన వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుక్మిణీసత్యభామ వేణుమాధవుడు ఆదివారం అర్ధరాత్రి గజారోహణంపై ఊరేగి భక్తులను తన్మయపర్చాడు. ఆలయపునఃనిర్మాణకర్త టేకులపల్లి రాంరెడ్డి దంపతులు, శాశ్వతధర్మకర్త పొద్దుటూరి రాజుగుప్తాతో పాటు గీతజ్ఞానమండలి సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను అరికట్టాలి



మజీద్‌పల్లిలో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న సుప్రజాతేజస్వి

వర్గల్,మే27: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వర్గల్ వ్యవసాయాధికారులు నడుంబిగించారు. సోమవారం మండలంలోని మీజద్‌పల్లి, సామలపల్లి, చందాపూర్, బొర్రెగూడెం, జంగంపల్లి, దండుపల్లి, మాదారం గ్రామాల్లో ఏఈవో సుప్రజాతేజస్వి రైతులకు విత్తనాలు తీసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. విత్తనాలు కొనే ముందు కంపెనీల లేబుల్, అగ్‌మార్క్ సింబల్,రసీదులు తప్పకుండా తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి యూనిఫామ్ అందిస్తాం



యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, మే 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికీ యూనిఫామ్ (ఏకరూప దుస్తులు) అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట, మండలంలోని ఆకారంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుడుతున్న యూనిఫామ్‌లను ఆయన పరిశీలించారు. మండలంలోని పలు పాఠశాలల మరమ్మతు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... జిల్లాలో 82,117 మంది విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## లింగనిర్ధారణ పరీక్షలు చేయొద్దు




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సిద్దిపేట, మే 27: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో పీసీ, పీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉందా లేదా, ఏమైనా అంగవైకల్యంతో ఉన్నా డా, లింగ సంబంధిత వ్యాధుల గుర్తింపు, చికిత్స సందర్భాల్లో మాత్రమే స్కానింగ్ మిషన్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ అనుసరించి కొత్తగా, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేయించుకోవాల్సిన వారు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషిన్లు, రిజిస్ట్రేషన్ గడువు తేదీకి నెల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం సలహా కమిటీ వైద్యులు మాట్లాడుతూ అక్రమ అబార్షన్స్ నిర్వహిస్తే యజమానులపైన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పీసీపీఎన్‌డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రజిని, సలహా కమిటీ సభ్యులు, డాక్టర్ సుజాత లక్ష్మి, డాక్టర్ వేణు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్ లింగం, ఎన్జీవో సభ్యులు వసంత, రాజ లింగం, మెంబర్ కన్వీనర్ డాక్టర్ రజిని, డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డెమో నవీన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### విచ్చలవిడిగా వైద్యసేవలందిస్తే చర్యలు

దుబ్బాక, మే 27: ఆర్‌ఎంపీ, పీఎంపీలు విచ్చలవిడిగా వైద్యసేవలందిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా ఉప వైద్యాధికారి(డిప్యూటీ డీఎంహెచ్‌వో) వినోద్‌బాబ్జి హెచ్చరించారు. దుబ్బాకలో అరుణ్ అనే ఆర్‌ఎంపీ ఓ రోగికి చర్మవ్యాధికి సంబంధించిన వైద్యం చేశాడు. ఆ వైద్యం కాస్తా వికటించినట్లు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టింది. ఈ విషయంపై సోమవారం ఆయన దుబ్బాకలో పలు ప్రైవేట్ ప్రథమ చికిత్స కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని వైద్యసేవలందిస్తే ఆర్‌ఎంపీపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

# బీఆర్ఎస్ విజయం ఖాయం



చేర్యాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మే 27 : వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగల రాకేశ్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జనగామ నియోజకవర్గ పట్టభద్రుల ఉప ఎన్నిక ఇన్‌చార్జి, సిరిసిల్లా రాజన్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న అన్నారు. పట్టణంలో ఉప ఎన్నిక సందర్భంగా ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు మాసాల్లో పరిపాలనలో అన్ని విధాలుగా విఫలమైందని, ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయలేదని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, కొంతమందికి ఉచిత కరెంట్ ఇస్తే హామీలు అమలు చేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు పాలనలో కేసీఆర్ అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.తన సొంత దవాఖానలో నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రులు తమ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, మండల, టౌన్ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు, గదరాజు చందు, బండమీది కరుణాకర్, మహిళా నాయకురాలు తాడెం రంజిత కృష్ణమూర్తి, మీస పార్వతి, పచ్చిమడ్ల మానస, ఎంపీటీసీ శివశంకర్, యూత్ మండల అధ్యక్షుడు అకుల రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



మిరుదొడ్డి: మాట్లాడుతున్న గొల్ల రాములు

### వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

మిరుదొడ్డి, మే 27: జూన్ 4వ తేదీన వెలువడే మెదక్ ఎంపీ ఫలితాల్లో వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు గొల్ల రాములు అన్నారు. సోమవారం మిరుదొడ్డిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సిరినేని వెంకటయ్య, ఎల్ములశేఖర్, గొట్టం స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు

సిద్దిపేట టౌన్, మే 27: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పాత బస్టాండ్ వద్ద సోమవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, నంబరు ప్లేట్లు లేకుండా, త్రిపుల్ రైడింగ్‌లు చేస్తున్న వాహనదారులను పట్టుకొని తల్లిదండ్రులను పిలిచి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రాయపోల్, మే 27: దౌల్తాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి తొమ్మిది నెలల నుంచి పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి బాలరాజ్, కార్మికులు మల్లేశం, కిషన్, రాములు, అంజయ్య, దాదేఖాన్, లక్ష్మి, ఎల్లం, కృష్ణ, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.



నారాయణరావుపేటలో కూలిపోయిన ఇల్లు

## ఈదురుగాలులతో దెబ్బతిన్న ఇండ్లు

నారాయణరావుపేట, మే 27: రెండు రోజులుగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఈదురు గాలులుతో 63 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, సుమారు రూ.12 లక్షల వరకు నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా దెబ్బతిన్న ఇండ్లను గుర్తించి నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నామన్నారు. పలు గ్రామాల్లో స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

### పనులు పూర్తి చేయాలి

సిద్దిపేటరూరల్,మే27: విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ మోహన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాఘవాపూర్,పెద్దలింగారెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

### పునరుద్ధరణ పనుల పరిశీలన

విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని ఎస్ఈ మోహన్‌రెడ్డి తెలిపారు. నారాయణరావుపేటలో విద్యుత్ పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు.విద్యుత్ శాఖ డీఈ మహేశ్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు తిరుపతి, రాజు, కొమురయ్య, రమేశ్‌రాజన్ పాల్గొన్నారు.



నారాయణరావుపేటలో విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

## నెంటూర్‌లో కేబుల్ దొంగల బీభత్సం

వర్గల్, మే 27: బోరుమోటర్ల కేబుల్ వైర్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు తెగబడ్డారు. ఒకటికాదు,రెండుకాదు దాదాపు 26 బోరుబావుల కేబల్‌వైర్లను కత్తిరించుకొని ఉడాయించారు. వర్గల్ మండలంలోని నెంటూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మల్లెచెరువు ప్రాంతంలోని రైతు మహేశ్‌గౌడ్,కృష్ణారెడ్డి తెల్లవారుజామున పొలంకాడికి వెళ్లగా కేబుల్ వైర్లు కత్తిరించి ఉండటంతో అవాక్కయ్యారు. ఇదే విషయం పక్కవారి బావులకాడి రైతులను అడుగగా వారిబోరుమోటర్లవైర్లు కూడా కత్తిరించి ఉండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రైతులందరూ ఫిర్యాదు చేయడానికి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

## పాఠ్య పుస్తకాల విక్రయానికి దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట అర్బన్, మే 27: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు బుక్ షాపుల ద్వారా విక్రయించుకోదలిచిన విక్రయదారులు మంగళవారం నుంచి ఈనెల 31వ తేదీలోగా వారికి కావాల్సిన ఇండెంట్‌తో జిల్లా విద్యాధికారి, సిద్దిపేట జిల్లా పేరు మీద రూ.10000 డీపీ తీసి సమర్పించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. గతంలో అనుమతి పొందిన విక్రయదారులు డీఈవో ఇచ్చిన ప్రొసీడింగ్స్ జతపర్చి సమర్పించాలన్నారు. అనుమతి పొందాలనే విక్రయదారులు మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, లేబర్ అధికారి అనుమతి పత్రాలతో గత సంవత్సరం సేల్స్ టర్నోవర్, సేల్స్ టాక్స్ చెల్లించిన రసీదు జతపర్చాలన్నారు.

## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సిద్దిపేట టౌన్,మే 27: సిద్దిపేట మోహినీపుర వేంకటేశ్వరస్వామి ఆలయం 49వ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆలయంలో 28 నుంచి జూన్ 2 వరకు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్ శర్మ సోమవారం తెలిపారు.ఉత్సవాల్లో స్వామి వారి తిరుకల్యాణం,స్వామి వారి దివ్య రథయాత్ర,నిత్య హోమం,విశేష పూజలు జరుగుతాయని చెప్పారు.

## చెట్లను తొలగించాలి

సిద్దిపేట, మే 27: విద్యుత్ వైర్ల కింద పెరిగిన కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం నాయకులు సోమవారం ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

## పంటల సాగుపై అవగాహన

బెజ్జంకి, మే 27: మండలంలోని దాచారం, ముత్తన్నపేట, రేగులపల్లి, కల్లెపల్లి, బేగంపేట, లక్ష్మీపూర్‌లో పంటలసాగుపై సోమవారం రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, భూమి స్వభావం ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.ఏఈవోలు రేణుకశ్రీ, మౌనిక, రచన, భరత్‌కుమార్, సాయిశంకర్, రైతులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

సిద్దిపేట అర్బన్, మే 27: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో తిరిగి బాధితులకు అప్పగించిన సంఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం జైన వైష్ణవి కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని తిరిగి బాధితురాలికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## దవాఖాన వద్ద అన్నదానం

సిద్దిపేట టౌన్, మే 27: సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సరిత, శివకుమార్ దంపతుల సహకారంతో సోమవారం దవాఖాన వద్ద అన్నదానం చేశారు. వనిత క్లబ్ అధ్యక్షురాలు వాణి, వీరేశం, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

బెజ్జంకి, మే 27: మండల కేంద్రంలోని సెంట్రల్‌లైట్స్ వద్ద విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్తంభాల వద్ద నిరసన చేపట్టారు. నిరసనలో మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్, నాయకులు మహేందర్, సంగెం మధు, శ్రవణ్, మహేశ్ ఉన్నారు.

## మొక్కలు పంపిణీ చేస్తాం



గజ్వేల్, మే 27: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పంపిణీ చేసే మొక్కలను నర్సరీల్లో త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. సోమవారం మున్సిపాలిటీలోని నర్సరీని ఆయన సందర్శించి అక్కడ పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. వర్షాలు పడగానే రోడ్ల వెంబడి నాటే మొక్కలతో పాటు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రీధర్ ఉన్నారు.

# కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుబ్బాకలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్ తదితరులు



నంగునూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో మీరాబాయి

దుబ్బాక, మే 27: ఫర్టిలైజర్ దుకాణాల్లో కల్తీవిత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం దుబ్బాక పట్టణంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన నేతృత్వంలో వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ అక్రమంగా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే ఆ దుకాణం లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో దుబ్బాక ఎస్సై గంగరాజు, ఏఈవోలు సంతోష్‌కుమార్, హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.



కొండపాక: దుద్దెడలో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

### ఫర్టిలైజర్ దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

కొండపాక(కుకునూరుపల్లి), మే 27: కొండపాక మండలం దుద్దెడలో పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో పోలీస్ టాస్క్‌ఫోర్స్ బృందం, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్సై విజయభాస్కర్, ఏవో ప్రియదర్శిని పాల్గొన్నారు.

### కృత్రిమ కొరత సృష్టించొద్దు

జగదేవ్‌పూర్, మే27: ఒకే రకం విత్తనాలను రైతులు కొనుగోలు చేయడం ద్వారా డిమాండ్ పెంచి కృత్రిమ కొరత సృష్టించవద్దని మండల వ్యవసాయాధికారి వసంతరావు సూచించారు.మండలంలోని తీగుల్, అనంతసాగర్, తిమ్మాపూర్, తీగుల్‌నర్సాపూర్, పలుగుగడ్డ, మాందాపూర్, దౌలాపూర్, జగదేవ్‌పూర్ గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో దుక్కి ప్రయోజనాలు, పచ్చి రొట్ట జనుము, జీలుగ విత్తనాలు పొలంలో అలకడం ద్వారా కలిగే మేలును వివరించారు. సరైన సస్యరక్షణ చర్యలు, పంట యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

### రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నంగునూరు, మే 27 : విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో మీరాబాయి అన్నారు. మండలంలోని మైసంపల్లి, మగ్దూంపూర్ గ్రామాల్లో సోమవారం విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వదులుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయరాదని.. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆథీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని.. ప్యాక్ చేసిన, లేబుల్ చేసిన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

### చిన్నకోడూరులో..

చిన్నకోడూరు, మే 27: నకిలీ విత్తనాలు, కాలంచెల్లిన విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై బాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి జయంత్ కుమార్ హెచ్చరించారు.సోమవారం మండల కేంద్రంలోని సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.గ్రామాల్లో విడి విత్తనాలు, మందులు విక్రయిస్తే వెంటనే డయల్ 100, సంబంధిత పోలీస్ స్టేషన్, లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 67100కు సమాచారం ఇవ్వాలన్నారు.

### కాలంచెల్లిన విత్తనాలు పట్టివేత

గజ్వేల్, మే 27: గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లోని పద్మావతి రైతు సేవా కేంద్రంలో పోలీసులు, మండల వ్యవసాయాధికారి సంయుక్తంగా సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కాలం చెల్లిన 140 కిలోల వరి విత్తనాలు,పురుగుల మందులు లభ్యమయ్యాయి. సీఐ సైదా, మండల ఏవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నకోడూరులో తనిఖీ చేస్తున్న అధికారులు